# ఆకాశవాణి హైద్రాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

తేది : 21.08.2017 సమయం : 13:10 గంటలు

## ముఖ్యాంశాలు

1. ఉపరాష్ట్రపతిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం. వెంకయ్యానాయుడుకు తెలంగాణ ప్రభుత్వం ఈ రోజు హైదరాబాద్‌లో ఘనంగా పౌర సత్కారం నిర్వహించింది. రాజకీయాల్లో ఉన్నతస్థాయికి ఎలా చేరాలో వెంకయ్యానాయుడిని చూసి నేర్చుకోవచ్చునని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అన్నారు.

2. తెలుగు రాష్ట్రాల ప్రజలు, ముఖ్యమంత్రులు పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలని, అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని వెంకయ్యానాయుడు సూచించారు.

3. నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికకు ప్రచార గడువు ఈ సాయంత్రం 6 గంటలతో ముగియనుంది.

4. ఈ తెల్లవారుజామున హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన విశ్రాంతి ఐఏఎస్ అధికారి పివిఆర్‌కె ప్రసాద్ అంత్యక్రియలు కొద్దీ సేపటి క్రితం పంజగుట్ట స్మశానవాటికలో పూర్తయ్యాయి.

----------------

ఉపరాష్ట్రపతిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం. వెంకయ్యనాయుడుకు తెలంగాణ ప్రభుత్వం ఈ రోజు హైదరాబాద్‌లో ఘనంగా పౌర సత్కారం నిర్వహించింది. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ పౌర సత్కార కార్యక్రమానికి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర తెలంగాణ మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పండితుల వేదోచ్ఛారణల మధ్య ముఖ్యమంత్రి వెంకయ్యనాయుడిని ఘనంగా సత్కరించారు. అంతకు ముందు దత్తాత్రేయ మాట్లాడుతూ వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి కావడం తెలుగు ప్రజలందరికి గర్వకారణమని అన్నారు. అసాధారణ ప్రతిభ కలిగిన వెంకయ్యనాయుడు సమాజాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు.

(సౌండ్‌బైయిట్స్)

గవర్నర్ మాట్లాడుతూ రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్యనాయుడు సభను సమర్థవంతంగా నిర్వహిస్తారని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ పదవులకే వన్నె తెచ్చే కొంది మంది నాయకులలో ఒక్కరని అన్నారు. రాజకీయాల్లో ఉన్నతస్థాయికి ఎలా చేరాలో ఆయనను చూసి నేర్చుకోవచ్చునని అన్నారు. నేటి తరం రాజకీయ నేతలకు వెంకయ్యనాయుడు ఆదర్శమని అన్నారు. ఉపరాష్ట్రపతి పదవిని చేపట్టాక తొలి సత్కారం తెలంగాణ ప్రభుత్వంచే చేయించుకునేందుకు అంగీకరించినందుకు ముఖ్యమంత్రి ఆయనకు ధన్యావాదాలు తెలిపారు.

(సౌండ్‌బైయిట్స్)

అనంతరం పౌర సత్కారానికి స్పందన తెలియజేస్తూ వెంకయ్యనాయుడు ప్రసంగించారు. హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఈ నగరం మినీ భారత్ అని అభివర్ణించారు.

(సౌండ్‌బైయిట్స్)

తెలుగు రాష్ట్రాల ప్రజలు, ముఖ్యమంత్రులు పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలని, అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని వెంకయ్యనాయుడు సూచించారు. అంతకు ముందు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయం చేరుకున్న వెంకయ్యనాయుడుకు గవర్నర్ నరసింహన్, కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, ముఖ్యమంత్రి

–చంద్రశేఖర్‌రావు, తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఘనంగా స్వాగతం పలికారు. బేగంపేట నుంచి వెంకయ్యనాయుడు నేరుగా రాజ్‌భవన్ చేరుకున్నారు.

---------------

ఈ తెల్లవారుజామున హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన విశ్రాంతి ఐఏఎస్ అధికారి పివిఆర్‌కె ప్రసాద్ అంత్యక్రియలు కొద్దీ సేపటి క్రితం పంజగుట్ట స్మశానవాటికలో పూర్తయ్యాయి. ఆయన కుటుంబ సభ్యులు, సాహితీ రంగ ప్రముఖులు, అధికారులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతకుముందు బంజారాహిల్స్‌లోని పివిఆర్‌కె నివాసానికి పలువురు ప్రముఖులు వెళ్లి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున రాష్ట్ర సలహాదారు పరకాల ప్రభాకర్ పివిఆర్‌కెకు ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు గిడుగు రుద్రరాజు, పలువురు విశ్రాంత ఐఎస్, ఐపీఎస్ అధికారులు, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ సభ్యులు, సాహితీ ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు.

77 ఏళ్ల పివిఆర్‌కె ప్రసాద్ అనారోగ్యంతో మొన్న రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఈ తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందిన్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన పివిఆర్‌కె ప్రసాద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పలు విభాగాల్లో పని చేశారు. ఖమ్మం కలెక్టర్‌గా, వైజాగ్ పోర్టు ట్రస్ట్ చైర్మన్‌గా, ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శిగా, టీటీడీ కార్యనిర్వహక అధికారిగా తమ సేవలందించారు. ఆయన సారధ్యంలో పలు వినూత్న ప్రాజెక్టులకు, సంస్కరణలకు రూపకల్పన జరిగింది. ఆయన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్‌కు చైర్మన్‌గా ఉన్నారు. పివిఆర్‌కె ప్రసాద్ తిరుమల ప్రాశస్త్యంపై రచించిన నాహ కర్త హరి: కర్త, తిరుమల లీలామృతం, తిరుమల చరితామృతం అందరి ప్రశంసలు పొందాయి. ఆయన మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్ర సంతాపం ప్రకంటించారు.

---------------

క్విట్ ఇండియా 75వ ఉద్యమ వార్షికోత్సవం పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ ఈ ఉదయం హైదరాబాద్‌లో భారీ ఎత్తున తిరంగ యాత్ర నిర్వహించింది. ఎల్బీ

–స్టేడియం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగిన ఈ యాత్రను కేంద్ర కార్మికశాఖ బండారు దత్తాత్రేయ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ 2022 నాటికి భారత్‌ను ప్రపంచంలోని అగ్రభాగాన నిలపటమే ప్రధానమంత్రి నరేంద్రమోడీ లక్ష్యమని చెప్పారు. దేశంలో పేదరికాన్ని నిర్మూలించే దిశలో కేంద్రం చర్యలు తీసుకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

---------------

దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు రేపు సమ్మెకు దిగనున్నాయి. బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకించటంతో పాటు తమ డిమాండ్ల సాధనకు యునైటెడ్ ఫోరం ఆఫ్ం బ్యాంకు యూనియన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. అయితే ప్రైవేటు బ్యాంకులు మాత్రం యధాతథంగా పనిచేయనున్నాయి. బ్యాంక్ యాజమాన్యాల సంఘంతో చీఫ్ లేబర్ కమీషనర్ సమక్షంలో జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకు దిగాల్సి వస్తోందని ఏఐబీఓసీ జనరల్ సెక్రటరీ డిటి. ఫ్రాంకో చెప్పారు.

---------------

నల్గొండ పట్టణంలో పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత ఏడాది కాలంగా పట్టణంలో సరిగా లేని పారిశుద్ధ్య పరిస్థితిని చక్కదిద్దేందుకు కలెక్టర్ గౌరవ ఉప్పల్ రంగంలోకి దిగారు. జాయింట్ కలెక్టర్ నారాయణరెడ్డి మున్సిపల్ కమిషనర్ లతో కలిసి ఆయన ఉదయం నుంచే పట్టణం అంతటా పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించారు.

---------------

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2016–17 విద్యా సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలలను 3,4కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఘనత కరీంనగర్ జిల్లాకు దక్కుతుందని పాఠశాలల అభివృద్ధికి 5 కోట్ల రూపాయల వరకు నిధులు విడుదల చేసినట్లు ఈటల రాజేందర్ చెప్పారు.

---------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం విధర్భ, దాని చుట్టు పక్కల ప్రాంతంలో ఆవరించి ఉంది. దీని ప్రభావంతో తెలంగాణలో పలుచోట్ల రాగల 24 గంటల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పలు చోట్ల, ముఖ్యగా రాయలసీమలో ఇదే సమయంలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయి.

---------------

నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికకు ప్రచార గడువు ఈ సాయంత్రం 6 గంటలతో ముగియనుంది. ఈ ఉప ఎన్నికలో విజయం సాధించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలతోపాటు ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షాలు ఒకరిపై ఒక్కరు ఘాటుగా విమర్శలు చేసుకున్నాయి.

---------------